ప్రజాశక్తి

గురువారం 19 జనవరి 2023



జిల్లా రవాణాశాఖ అధికారిగా మల్లిఖార్జున రెడ్డి

ప్రజాశక్తి- పార్వతీపురం



జిల్లా రవాణా శాఖ అధికారిగా సి. మల్లిఖార్జున రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా నుండి పార్వతీపురం మన్యం జిల్లాకు ఈయన బదిలీపై వచ్చారు. మల్లిఖార్జున రెడ్డి గతంలో నెల్లూరు, రాయలసీమ, పశ్చిమ గోదావరి తదితర జిల్లాలలో వివిధ హోదాలలో పని చేశారు. జిల్లా రవాణా అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఇన్‌ఛార్జ్ జిల్లా రవాణా అధికారిగా పని చేసిన ఎం. శశి కుమార్, కార్యాలయ పరిపాలన అధికారి సీతారాం, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గిట్టుబాటు కాని పాలధర

- కష్టకాలంలో పాడి రైతులు
- ప్రారంభం కాని జగనన్న పాలవెల్లువ
- అందని పశు బీమా బకాయిలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

పాడి రైతు కష్టకాలంలో కొట్టుమిట్టాడు తున్నాడు. ఒకవైపు రోజురోజుకూ పశుగ్రాసం ధరలు పెరుగుతుంటే మరోవైపు డెయిరీ పాల ధరలు మాత్రం అంతమాత్రంగా ఉంది. దీంతో పాడి రైతులకు పశుపోషణ కడుభారంగా మారింది. రోజురోజుకూ దాణా వ్యయం పెరిగిపోవడంతో, పాడి రైతుకు ఆర్థికంగా ఎంతో ఇబ్బందికరంగా మారింది. పశువులకు వాడే దాన మార్కెట్లో రోజుకు సరాసరి రూ.25 నుంచి రూ.30కు కొనుగోలు చేయాల్సి వస్తుంది. అయితే ఇందుకు తగ్గట్టు పాలు ధరలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.



డెయిరీ ఫాంలో ఉన్న పాడి పశువులు

నేటికీ అందని పశు బీమా బకాయిలు

ఏదైనా అనారోగ్య సమస్యలను కానీ, ప్రమాదవశాత్తుగానీ మరణించిన పశువులకు ప్రభుత్వం అందించే ఉచిత బీమా చెల్లింపులు సక్రమంగా చెల్లించకపోవడంతో రైతులు ఎంతో నష్టపోతున్నారు. నేటికీ జిల్లాలో 1498 మంది రైతులకు చెల్లించాల్సిన సుమారు రూ.నాలుగు కోట్లు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి.

కానరాని పశువైద్యసేవకులు

గ్రామ సచివాలయంలో పశువైద్య సహాయకులను ప్రభుత్వం నియమించడంతో ఎంతో మంది పాడిరైతులు సంతోషపడినప్పటికీ ఆదిశగా వారి సేవలు మాత్రం పాడిరైతుకు అందడంలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రతి రైతు భరోసా కేంద్రంలో పశు వైద్య సహాయకులు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం మూడు గంటలు నుండి ఐదు గంటల వరకు గ్రామాల్లో సేవలందించాలి. అయితే వీరు ఉదయం 10.30 గంటలైతే గానీ విధుల్లోకి రాకపోవడంతో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. చాలామంది పశువైద్య సహాయకులకు సరైన పరిజ్ఞానం, అనుభవం లేకపోవడంతో పశువులకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే తమకు అవగాహన లేదని చెప్పడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వైద్యులు బారినపడి వేల రూపాయల ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సహాయకులు కేవలం పశువులకు బీమాకు సంబంధించిన ట్యాగులు, ప్రభుత్వం చేపట్టే టీకాలు వేయడానికే తప్ప మరే ఇతర అవసరాలకు పశు వైద్య సహాయకులు తమకు సహకరించడంలేదని రైతులు విమర్శిస్తున్నారు.

వేధిస్తున్న మందుల కొరత

పశు వైద్య శాఖలో మందుల కొరత చాలా రోజులుగా కనిపిస్తోంది. పశువులకు ఏమైనా రోగాలు వస్తే బయట మార్కెట్లో కొనుక్కోమని మందులు చీటీలు రాసి పశు వైద్యులు ఇస్తున్నారు. పశువులకు వేసే రోగనిరోధక టీకాలు, సాధారణ జ్వరాలకు ఇచ్చే మందులు తప్పితే మరే ఇతర జబ్బులు బారిన పడినా బయట మార్కెట్లోనే కొని, వేల రూపాయల ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.

గిట్టుబాటు కాని పాలధరలు

డైరీలు ప్రకటించిన ఆవు పాల ధరలు రూ.30 నుంచి రూ.40. కానీ రైతులకు నాణ్యత పేరిట 30 నుండి 35 రూపాయల మధ్యలో అందుతుంది. గేదె పాల రేట్లు రూ.40 నుంచి రూ.55 డైరీలు ప్రకటించినప్పటికీ రైతుకు అందేది మాత్రం రూ.35 నుంచి రూ.45 మాత్రమే. ఇప్పుడు వస్తున్న పాల రేట్లతో పశువులను పెంచడం ఎంతో ఆర్థిక భారంగా ఉంటుందని పశువులకు వాడే దానా రేట్లు అధికంగా ఉండడంతో రైతులుకు గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు.

రూ.15 కోట్లతో రాజాం - పాలకొండ రోడ్డు పనులు

- రాజాంలో రోడ్ల విస్తరణ పనులను సమన్వయంతో చేపట్టాలి
- మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశం
- రూ.20 కోట్లతో రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-రాజాం

రోడ్లుభవనాలశాఖ ఆధ్వర్యంలో రాజాం పట్టణంలో విజయనగరం - పాలకొండ రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 కోట్లకు అదనంగా మరో రూ.10 కోట్లు కట్టడాలు, భవనాలకు నష్టపరిహారం చెల్లింపు తదితర వాటికి అవసరమని గుర్తించామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఈ మేరకు అవసరమైన నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులతో సంప్రదించి, వారితో సమన్వయంతో పనిచేయడం ద్వారా రోడ్ల విస్తరణ పనులను సకాలంలో పూర్తిచేసేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. రాజాం పట్టణంలో ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో చేపట్టనున్న నాలుగు కిలోమీటర్ల రోడ్ల విస్తరణ పనులకు మంత్రి బుధవారం బి.ఆర్.అంబేద్కర్ కూడలి వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక సూర్యదుర్గ కళ్యాణమండపంలో ప్రజాప్రతినిదులు, జిల్లా అధికారులతో రోడ్డువిస్తరణ పనులపై సమీక్ష నిర్వహించారు.



రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

రోడ్డు విస్తరణలో భవనాలు, కట్టడాలు కోల్పోయిన వారికి రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సి వుంటుందని, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న వారు పరిహారం నగదు రూపంలో చెల్లించాలని కోరుకుంటున్నారని పట్టణ ప్రణాళిక అధికారి మంత్రికి వివరించారు. ప్రభుత్వం ద్వారా పరిహారం నగదు రూపంలో చెల్లింపులకు అవకాశం వుంటే పరిశీలిస్తామని, లేనిపక్షంలో టి.డి.ఆర్.బాండ్లు జారీచేసి అనంతరం వాటిని నగదుగా మార్చుకొనే అవకాశం కల్పిస్తామని మంత్రి అన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ.2.6 కోట్ల మేరకు విద్యుత్ స్థంభాలు, లైన్ల మార్పిడికి అవసరం వుంటుందని అంచనాలు రూపొందించినట్లు విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు వివరించారు. గ్రామీణ నీటిసరఫరా విభాగం ఆధ్వర్యంలో పైప్‌లైన్ల మార్పిడి కోసం రూ.3 కోట్లు అవసరం వుంటుందని ఆ శాఖ ఎస్.ఇ. ఉమాశంకర్ వివరించారు. ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖకు చెందిన తాగునీటి డిస్ట్రిబ్యూషన్ మెయిన్ల మార్పుకోసం మరో రూ.3.20 కోట్లు అవసరం వుంటుందని అంచనాలు రూపొందించినట్లు ఆ శాఖ డిఇ తెలిపారు. రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా రెండు కిలోమీటర్ల మేరకు డ్రెయిన్ల నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి ఆటంకాలు లేనందున ముందుగా డ్రెయిన్ల పనులు ప్రారంభించాలని రోడ్లు భవనాల శాఖ ఇఇ రమణను మంత్రి ఆదేశించారు. ఈలోగా బాధితులకు పరిహారం చెల్లింపు వంటి పనులు పూర్తి చేయాలన్నారు. విస్తరణలో భాగంగా పైప్‌లైన్లు, విద్యుత్ లైన్ల మార్పు కోసం నిధులు అవసరమైన ప్రభుత్వ శాఖలు తమ ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని మంత్రి సూచించారు. రోడ్ల విస్తరణ పనులు పదిహేను నెలల్లో పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బొబ్బిలి జంక్షన్‌కు సమీపంలో అవసరమైన మరో కల్వర్టు నిర్మాణాన్ని కూడా విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టేందుకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు.

రాజాం నుంచి పాలకొండ రోడ్డును కూడా రూ.15 కోట్లతో పటిష్టం చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించామని మంత్రి తెలిపారు. సమావేశంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్, శ్రీకాకుళం జెడ్‌పి వైస్ ఛైర్మన్ సిరిపురపు జగన్మోహన్, కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేడాడ తిలక్, ఆర్‌డిఒ అప్పారావు, మున్సిపల్ కమిషనర్ కష్ణారావు, తహశీల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఒ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు భద్రత వారోత్సవాల పోస్టర్లను మంత్రి, కలెక్టర్ తదితరులు ఆవిష్కరించారు.



వలస బల్లేరులో నిరుపయోగంగా ఉన్న జిసిసి భవనం

నిరుపయోగంగా జిసిసి భవనం

ప్రజాశక్తి - కురుపాం

గిరిజనులకు ప్రత్యేకించి నిత్యవసర సరుకులు అందించడమే లక్ష్యంగా ప్రతి పంచాయతీ కేంద్రంలో భవనాన్ని నిర్మించి దాని ద్వారా ప్రజలకు సేవలందించడమే కాకుండా, నిత్యవసరంగా సరుకులు అందజేయడమే లక్ష్యంగా నిర్మించింది. అయితే ప్రభుత్వ ఆశయాలు అంతవరకు బాగానే ఉన్నా మండలంలో వలసబల్లేరు పంచాయతీ కేంద్రంలో నిర్మాణం పూర్తి చేసిన జిసిసి భవనం కొన్నేళ్లు గడుస్తున్నా కనీసం అందులో నిత్యవసర సరుకులు వేయకుండా నిరుపయోగంగా ఉంది. దీంతో ప్రభుత్వ సొమ్మును వృథా చేసి నిర్మించి గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ భవనం ద్వారా గిరిజనులకు అందాల్సిన సేవలు కలగానే మిగిలిపోయాయి. ఇక్కడే కాకుండా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని ఉపయోగంలో తీసుకొచ్చి, తద్వారా సేవలు అందించాలని కోరుతున్నారు.

రీ సర్వే వేగవంతానికి చర్యలు : జెసి

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేసేందుకు అన్ని విధాల చర్యలూ చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. మండలంలో రి సర్వే జరుగుతున్న గుమ్మడ సీతామాంబపురం, నందాపురం సీతమాంబ పురం గ్రామాల్లో ఆయన రిసర్వే పనులను బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈ సర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూత్కింగ్ భూముల హద్దులను గుర్తించే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేపై రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రకారం రైతుల సహకారం పూర్తిస్థాయిలో అందించాలని కోరారు. రీ సర్వేలో రైతులకు ఇబ్బంది పెట్టే విధానానికి అధికారులు స్వస్తి పలుకుతున్నారని తెలిపారు. రీ సర్వే జరిగే సమయంలో సంబంధిత రైతులకు ముందస్తుగా సమాచారాన్ని నోటీసు ద్వారా తెలియజేయాల న్నారు. ప్రభుత్వం పగడ్బందీగా నిర్వహిస్తున్న రీ సర్వే పనులను ఎటువంటి జోప్యం పనికిరాదని ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది రీ సర్వే పై దృ సారించాలని తెలిపారు. సర్వే జరుగుతున్న సమయంలో రికార్డులన్నీ సక్రమంగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పులు నమోదు కాకుండా పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పరిశీలనలో ఆయనతో పాటు తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ, విఆర్‌ఒలు, సర్వేయర్లు ఉన్నారు.

సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జెసి ఆనంద్



వీరఘట్టం : భూ రిసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వే చేసేటప్పుడు ముందుగా రైతులకు సమాచారం ఇచ్చి వారిని అందుబాటులో ఉంచే విధంగా చూడాలన్నారు. రీ సర్వేలో రైతుల నుండి ఎటువంటి ఫిర్యాదులూ రాకుండా సక్రమంగా సర్వే చేపట్టాలన్నారు. రీసర్వే శక్తి వంచన లేకుండా కృషి చేయవలసిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సర్వేలో ఎటువంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం గ్రామాల వారిగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో తహశీల్దార్ జల్లెపల్లి మాధవి, ఆర్ఐ జి ప్రసాదరావు, మండల సర్వేర్ ఆర్ శ్రీనివాసరావు, విఆర్‌ఒలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

20లోగా గృహ సారథుల నియామకం

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 20వ తేదీలోగా గృహ సారథుల నియామకం పూర్తి చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు పార్టీ నాయకులకు సూచించారు. బుధవారం జగన్నాథ కన్వెన్షన్ హాల్లో వైసిపి విజయనగరం, మన్యం జిల్లాల మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల జెసిఎస్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి, మన్యం జిల్లా అధ్యక్షులు శ్రీ శత్రుచర్ల పరీక్షిత్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 20లోగా గృహ సారథుల నియమకాన్ని పూర్తిచేసుకుని జాబితాను జిల్లా, కేంద్ర కార్యాలయానికి పంపించవలసిందిగా సూచించారు. సమావేశంలో శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి,ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, బడుకొండ అప్పలనాయుడు, కంబాల జోగులు, పాముల పుష్పశ్రీవాణి, విశ్వసరాయ కళావతి, అలజంగి జోగారావు, ఎమ్మెల్సీలు డాక్టర్ సురేష్ బాబు, పాలవలస విక్రాంత్, నియోజక వర్గాల పరిశీలకులు, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అన్నారు. బుధవారం 8,9,10,11 వార్డులలో పారిశుధ్య నిర్వహణ తీరును మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారి సిహెచ్ మురళి, ఆయా వార్డు సచివాలయాల పారిశుధ్య సెక్రటేరీలతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పండగల సందర్భంగా పెద్ద ఎత్తున ఉమ్మడి కుటుంబాలు చేరుకొని పండగ చేసుకున్నారని, కార్మికులకు కూడా సెలవులు రావడం వల్ల ఎక్కడకక్కడ చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయని వాటిపై దృష్టి సారించి ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులు చేయించాలని ప్రజారోగ్య అధికారి, సచివాలయాల పారిశుధ్య కార్యదర్శులకు సూచించారు.

ఆర్‌టిసి స్థలాల అద్దెకు టెండర్లు : డిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



ఆర్‌టిసి స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎం దుర్గమ్మ

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో ఖాళీగా ఉన్న స్థలాలను అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం ఆర్‌టిసి డిఎం దుర్గమ్మ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 7న నోటిఫికేషన్ జారీ చేశామని, 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు లను ఈ నెల 28లోగా నేరుగా విజయ నగరం ఆర్‌ఎం ఆఫీసులో అందజేయాలన్నారు. స్థలాల వద్ద షాపుల నిర్వహణకు 15 ఏళ్ల కాల పరిమితికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆమె చెప్పారు. నెలవారి అద్దె రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. టెండర్లు దక్కించుకున్న వారు ఆరు నెలల వరకు ఎటువంటి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కేవలం షెడ్యూల్డ్ తెగల వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

అటవీ భూములపై హక్కు కల్పించాలి

- తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం, వ్యవసాయ కార్మికసంఘం డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏళ్ల తరబడి సాగులో ఉన్న అటవీ భూములపై గిరిజనులకు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ వద్ద మెంటాడ మండలం ఆగూరుకు చెందిన గిరిజనులు ధర్నా చేశారు. తమ భూములను కబ్జా చేసిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రికార్డులను తారుమారు చేసిన స్థానిక తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాకోటి రాములు మాట్లాడుతూ ఆగూరు రెవెన్యూ పరిధిలోని సంఘం గుడ్డివలస, కింద గూడెం, పనుకువాని వలస, సిడగం వలస, రాయవలస, ఎర్రాడవలస గిరిజనులు సాగు చేసుకుంటున్న ఫారెస్ట్ భూమిపై హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని, కబ్జాకు పాల్పడిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వే నెం. 239, 240 241 242లలో సుమారు 70 ఎకరాలు రిజర్వు ఫారెస్ట్ భూమిని సుమారు 70 కుటుంబాలు తాతల కాలం నుండి సాగు చేస్తున్నారని, జీడి, వరి, పత్తి, వంకాయ మొదలగు పంటు పండించుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పట్టాలివ్వాలని అనేక దఫాలుగా అధికారులకు వినతులు అందజేశారని, గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దార్లు పట్టాలిస్తామని చెప్పారని గుర్తు చేశారు. అయినా నేటివరకు పట్టాలు రాక చాలా ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. బండారు సంజీవరావును, అతని అనుచరులు తమ భూములను ఆక్రమించుకొని, గ్రామాలు విడిచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని అన్నారు. ఇందులో 20 ఎకరాలు ఫారెస్ట్ భూమి గజపతినగరం మండలం కొణిసి గ్రామానికి చెందిన పెనుమత్స రాజశేఖరరాజు తదితరులు దౌర్జన్యంగా హక్కులు పొందారని తెలిపారు. పెత్తందారులకు కొమ్ముకాసిన తహశీల్దార్ రవిపై చర్య తీసుకొని, తమ భూములపై హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో గేదెల పెదరాము, జి.సన్యాసిరావు, ఎస్.జానకిరామ్, ఈదుబిల్లి సన్యాసిరావు, గణేష్, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు



టీకాలపై అవగాహన కల్పిస్తున్న ఇమ్యునైజేషన్ అధికారి

చిన్నారులకు నిర్ణీత కాలంలో టీకాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

చిన్న పిల్లల్లో సార్వత్రిక టీకాలను నిర్ణీత సమయానికి క్రమం తప్పకుండా వైద్య సిబ్బంది వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని నర్సిపురం గ్రామాన్ని ఆయన సందర్శించి వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. టీకా గడువు తేదీల షెడ్యూల్ నిర్వహణకు సంబందించిన టిక్లర్ బ్యాగ్‌ను పరిశీలించారు. అర్హుల జాబితాను, టీకా నిర్వహణ రికార్డులను, పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎఫ్ఐపివి మూడవ డోసుకు అర్హులైన పిల్లలకు టీకా వేయడాన్ని పరిశీలించారు. పిల్లల్లో సాధారణంగా వచ్చే శ్వాసకోశ సంబంధమైన అనారోగ్య లక్షణాలపై అవగాహన కల్పించి, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్ష పరిశీలన

మక్కువ : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఓపెన్ స్కూల్ ప్రిపరేటరీ ఎగ్జామ్‌ను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ బుధవారం పరిశీలించారు. ఎగ్జామ్ బాగా రాయమని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్, ఎంఇఒ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వి. ఇందిరా

సిఐటియు సభలను జయప్రదం చేయండి

సీతానగరం : సిఐటియు ఆలిండియా 17వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిరా పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కాసయ్యపేట రైస్ మిల్లు వద్ద, కళాసి వర్కర్స్, స్కీం వర్కర్స్‌తో కలిసి ఆమె సిఐటియు ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెంగళూరులో సిఐటియు 17వ అఖిలభారత మహాసభలు జరగనున్నాయని కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పైన ప్రభుత్వ విధానాల పైన మహా సభల్లో చర్చించి రాబోయే మూడేళ్లలో పోరాటాలు రూపకల్పన చేస్తారన్నారు. జీవో నెంబర్ 1ని తెచ్చిందని, ఇది చాలా దుర్మార్గమైన జీవో అని ఈ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో సిఐటియు చేస్తున్న అన్ని పోరాటాలను ప్రజలు బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి. వెంకటరమణ, సిఐటియు జిల్లా సహాయక కార్యదర్శి ఆర్ రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, కళాసి సంఘం నాయకులు తేలు సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పూడికలు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

వీరఘట్టం : స్థానిక మేజర్ పంచాయతీ కాలువల్లో పూడికలను బుధవారం తొలగించారు. ఈ నెల 17వ తేదీన పల్లెలు పరిస్థితి ఇంతేనా? అనే శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్థానిక మేజర్ పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు ప్రధాన రహదారికి ఇరువైపులో ఉన్న కాలువల్లో పారిశుధ్య కార్మికులు పూడికలను తొలగించారు.


వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండల కేంద్రంలోని దళిత వీధి, నడుకూరు గ్రామాల్లో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి ఉమామహేశ్వరి గర్భిణులకు, బాలింతలకు, చంటి పిల్లలతో పాటు వివిధ రకాలైన వారికి వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఓ శాంతి కుమారి, ఎంఎల్ హెచ్‌పిలు కావ్య, ఏఎన్ఎంలు సరస్వతి, జానకి, ఆశా కార్యకర్తలు,104 సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

పెద్ద బొండపల్లిలో నేత్ర వైద్య శిబిరం

పార్వతీపురం రూరల్ : మండలంలోని పెద బొండపల్లి సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు బుధవారం రామాలయం ఆవరణలో నేత్ర వైద్య శిబిరం నేత్ర వైద్య అధికారి డాక్టర్ నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలకు చెందిన 60 ఏళ్లు పైబడిన వారికి నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుబ్బలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

దుకాణాలు తనిఖీ

పాలకొండ : పట్టణ పరిదిలో బుధవారం నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు, ఆర్ఐ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బందితో కలిసి మార్కెట్ ఏరియా, మెయిన్ రోడ్‌లో గల 30 ధుకాణాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. 120 మైక్రాన్‌లు కంటే తక్కువ సామర్థ్యం కలిగిన ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న 10 దుకాణాలను గుర్తించి యజమానుల నుండి నిబంధనలకు విరుద్దంగా వాడుతున్న, అమ్ముతున్న సుమారు 10 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వారికి అపరాద రుసుం కింద రూ. 10 వేలు జరిమాన విధించారు. ఇకపై ఇటువంటి కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ : మండలంలో మక్కువ విద్యుత్ సబ్ స్టేషన్, మావుడి విద్యుత్ సబ్ స్టేషను పరిధిలో ఉన్న గ్రామాలకు శంబర పండగ నిమిత్తం సబ్ స్టేషను మరమ్మత్తులు, ట్రీ కటింగ్ వర్కు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ జెఇ శాంతారామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గురువారం, శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతోందన్నారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

మహనీయుడు ఎన్‌టిఆర్

జిల్లా వ్యాప్తంగా బుధవారం మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాలను టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. కొన్ని చోట్ల ఆయన చిత్రపాటలకు పూలమాలలువేసి నివాళులర్పించగా మరికొన్ని చోట్ల ఆయన విగ్రహాలకు పాలభిషేకం చేశారు.

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగిలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు స్వగృహంలో బుధవారం ఎన్‌టిఆర్ 27వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ టి. జగదీశ్వరితో కలిసి ఆయన ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జగదీశ్వరి చిన మేరంగిలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రంలో టిడిపి నాయకులు డొంకాట రామకృష్ణ, ఐదు మండలాల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ పువ్వల లావణ్య, బిడ్డిక పద్మావతి, భూపతి దొర, తాడంగి రామారావు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్ కె.వి. కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో టిడిపి ఇంఛార్జి జగదీశ్వరి పాల్గొని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, భారతి, కన్నా, ఆకుల రమేష్, పండ చిట్టి, బోటు గౌరీ పాల్గొన్నారు.

సీతంపేట: టిడిపి నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యంలో సీతంపేట క్యాంపు కార్యాలయంలో


సాలూరు: మాట్లాడుతున్న గుమ్మడి సంధ్యారాణి


జియ్యమ్మవలస: నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శత్రుచర్ల

ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధ మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మహిళా నేతలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం కొమ్మునేని కిషోర్ ఇంటి వద్ద బుధవారం ఎన్టీఆర్ వర్ధంతిలో భాగంగా ఆయన చిత్ర పట్టానికి టిడిపి నాయకులు హరి గోపాల్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, ఆర్ వేణుగోపాల్ నాయుడు, పెదబోగిలి సర్పంచ్ జె. తేరేజమ్మ, గరికయ్య తదితరులు పాల్గొన్నారు.

వంట సామాగ్రి అందజేత

స్థానిక గూడెం వీధిలో గత వారం క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడు ఇల్లు కాలిబూడిదైన సంగతి తెలిసిందే. ఈ అగ్ని ప్రమాద బాధితులకు ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ తేరేజమ్మ, గరికయ్య వంట పాత్రలు, దుప్పట్లు, డబ్బులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతిరావు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పట్టణ నందమూరి సేవా సంఘం ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. పట్టణ నందమూరి సేవా సంఘం అధ్యక్షులు యడ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాతబస్టాండ్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షులు మజ్జి కృష్ణారావు, 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, వైస్ ప్రెశిడెంట్ తోట నాగరాజు, కార్యదర్శిలు బూర్లి వెంకటేష్, మక్కువ కిషోర్, రౌతు చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు బోగాపురపు రవి నాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డికి ప్రసాద్, రాజు, కొల్ల మధు, కోరాడ రాజేష్, గురుబిల్లి లక్ష్మి పతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంబర ఎంపిటిసి పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, ఎన్ శశి కుమార్, భరోతు నీలకంఠం నాయుడు, ఆల బిల్లీ కుమారస్వామి, కె. ధర్మారావు, మాచర్ల నందీశ్వరరావు, అలజంగి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఎన్‌టిఆర్ 27వ వర్ధంతి సందర్భంగా కృష్ణపల్లిలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహా నికి మాజీ ఎమ్మెల్సీ, మాజీ చైర్ పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవితో కలిసి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తాళ్ల బురిడి గ్రామంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు డి. మోహన్‌రావు, గొట్టాపు వెంకటనాయుడు తాళ్ల బురిడీ గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు జి. రవికుమార్, నాయకులు భాను చంద్రమౌళి పాల్గొన్నారు.

సాలూరు రూరల్: మండలంలోని శివరాం పురం, జీగిరాం గ్రామాలలో ఎన్‌టిఆర్ విగ్రహాల వద్ద నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి గుమ్మడి సంధ్యారాణి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాలూరు, మక్కువ పార్టీ మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, కుల్ల వేణు, అఖ్యాన తిరుపతి, డొంక అన్నపూర్ణ,



పాలకొండ: నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు


సీతానగరం: బాధితులకు పాత్రలందిస్తున్న టిడిపి నాయకులు

సింహాచలం, యుగంధర్, రమాదేవి, పాల్గొన్నారు.

సాలూరు: ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్లో ఆయన విగ్రహానికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌పి భంజ్ దేవ్, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్, మక్కువ టిడిపి మండల అధ్యక్షుడు జి.వేణుగోపాలరావు, పాచిపెంట మండల నాయకులు ముఖి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పాచిపెంట : ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రం పెద్ద బజార్ రచ్చబండ కూడలి వద్ద మండల టిడిపి అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 250 మంది పేదలకు పలువురు నాయకులతో కలిసి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పి వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, మంచాల పారమ్మ, కొత్తల పోలినాయుడు, పి. ఉమామహేశ్వర రావు, ఎక్కుడు శివ, పి. వెంకటరమణ పాల్గొన్నారు.

బలిజిపేట: స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు బుధవారం పాలభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అప్పారావు, వాడాడ రాము, పింక్ రామ్మోహన్‌రావు, పాపినాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : పాలకొండ నగరపంచాయతీ పరిధిలో నియోజకవర్గం ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో కోట దుర్గ ఆలయ జంక్షన్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.అప్పలనాయుడు, గంటా సంతోష్, గండి రామినాయుడు, కిమిడి కాసింనాయుడు, వెన్నపు శ్రీనువాసరావు పాల్గొన్నారు.త

రోడ్డు లేదు... తాగునీరు రాదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్రం వచ్చి నేటికి 77 ఏళ్లు గడుస్తున్నా నేటికీ గిరిజన జీవితాల్లో సంక్రాంతులు కానరావడం లేదు. అభివృద్ధికి నోచుకోక నిత్యం సమస్యలతో గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా గిరిజన జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదు. నేటికి చాలా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేని దుస్థితి. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరందని పరిస్థితి. చలములు, గెడ్డవాగులు నీటిపైనే ఆధారపడుతూ బతుకు జీవనం సాగిస్తున్నారు.వివరాల్లోకి వెళితే...

మండలంలోని వాడపుట్టి, వనకాబడి, జోగిపురం, శంభు గూడ, వాడ జంగి, ఇజ్జ కాయి, టంకు, గుల్ల లంక, మంత్ర జోల, చిన్న రావి కోన, కొండ బిన్నిడి, బయ్యాడ తదితర మారుమూల కొండ శిఖర గ్రామాల


చలమనీరు తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

ప్రజలు నేటికీ బాహ్యప్రపంచానికి దూరంగా ఉంటున్నారు. గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. రహదారి సౌకర్యం లేకపోవడంతో కాలిబాటే శరణ్యం అవుతోంది. మరోవైపు పెద్ద పెద్ద వాహనాలు గ్రామానికి వెళ్లలేక పోవడంతో తాగునీటి బోర్ల నిర్మాణం జరగలేదు. దీంతో గిరిజనులు చలమలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అనారోగ్యం వాటిల్లితే అత్యవసర సమయాల్లో వైద్య సేవలందని పరిస్థితి. దీంతో తరచూ మరణాల సంఖ్య కూడా అక్కడ నమోదు కావడం విచారకరం. గర్భిణీలు, వృద్ధులు వైద్యం కోసం రావాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. గిరిజన విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగానే ఉంటుంది. కొండలపై గ్రామాలకు అధికారులు పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉండడంతో చాలా వరకు విద్యార్థులు డ్రాపౌట్ సంఖ్య కనిపిస్తోంది. పై గ్రామాల నుంచి గిరిజనులు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి వెళ్లిరావాలంటే కనీసం ఒక రోజు పడుతుంది. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాతో నైనా తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుంటారని గిరిజనుల కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు.

వెనుకబాటు జీవితం...

కొండ శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం

అభివృద్ధికి నోచుకోని గిరిజన గ్రామాలు


అభివృద్ధికి నోచుకోని గిరిజన గ్రామం

లేకపోవడంతో నేటికీ గిరిజనులు వెనకబడి జీవనం గడుపుతున్నారు. విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు మెరుగుపడలేదు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

పువ్వల తిరుపతి రావు, ఎపి గిరిజన సంఘం మండల కార్యదర్శి, గుమ్మలక్ష్మీపురం.

గిరిజనుల పట్ల చిన్నచూపు

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా గిరిజనుల పట్ల చిన్నచూపు కొనసాగుతూనే ఉంది. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో ఎక్కడ కాని రావడం లేదు.

కోలక అవినాష్, ఎపి గిరిజన సంఘం, రాష్ట్ర నాయకులు

యువశక్తి ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్ర గ్రామంలో బుధవారం ఉత్తరాంధ్ర జనసేన నాయకులు బిపి నాయుడు, నియోజకవర్గ నాయకులు అల్లు సాయిరాం కుమార్ ఆధ్వర్యంలో యువశక్తి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో వారిద్దరూ మాట్లాడుతూ ఈ నెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జరిగిన యువశక్తి కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల జనసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు, బంధువులకు వివరించి వారిని జనసేన పార్టీలోకి భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జానీ, ఎం. పుండరీకం, జామి అనీల్, పొట్నూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొల్లి సాంబమూర్తి

జిఒ రద్దు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

త్రైమాసిక రోడ్డు ట్యాక్స్ పేరుతో 30శాతానికి పైగా భారాలు పెరిగే జీవోను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుని రద్దు చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వాహన యజమానులపై భారం మోపుతూ తెచ్చిన త్రైమాసిక రోడ్డు ట్యాక్స్ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్రోల్ డీజిల్ ధరలు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ జిఒతో మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. పరోక్షంగా ఈ భారం ప్రయాణికులపై పడుతోందన్నారు. ఈ జిఒను రద్దు చేయకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డ్రైవర్లు శ్రీను, గోవిందు, రాము, లక్ష్మణరావు పాల్గొన్నారు.

బరువెక్కిన గుండెలతో తిరుగు పయనం

ప్రజాశక్తి - వీరఘట్టం

పల్లెల్లో నిన్నటి వరకు పిల్లల కేరింతలు, వీధుల్లో ముగ్గులు, బంధువులతో అచ్చట ముచ్చట్లు, అమ్మానాన్నలతో పండగలో సరదాగా గడిపిన ప్రజలు బతుకుతెరువు కోసం పట్టణాలకు బయలుదేరడంతో పల్లెలు ఒక్కసారిగా మూగబోయాయి. ఈ మేరకు బుధవారం వీరఘట్టం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుండి పల్లె ప్రజలు పట్టణాలకు చేరుకునేందుకు వీలుగా వీరఘట్టంలో బస్సుల కోసం పల్లె ప్రజలు వేచి చూసే దృశ్యాలు కనిపించాయి. పల్లె ప్రజలు ఒక్కసారిగా అధిక సంఖ్యలో చేరుకోవడంతో బస్సులు చాలకపోవడం తో ఎలాగోలా పట్టణానికి చేరుకోవాలని చాలా మంది ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు.

సీతానగరం: సంక్రాంతి పండగ ముగించుకొని వివిధ

● స్వగ్రామాలను వీడి పట్టణాలకు..

● కిక్కిరిసిన రైళ్లు , బస్ స్టేషన్లు



పార్వతీపురం: రైలు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ప్రాంతాలకు వెళ్లేందుకు ఉద్యోగులు వ్యాపారులతో బుధవారం రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. విజవాడ, విశాఖ, హైదరాబాదు వెళ్లే రైళ్లు ఆలస్యం కావడంతో మరింత రద్దీతో నిండిపోయింది. ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా రైల్వే శాఖ కూడా కొన్ని ప్రత్యేక ట్రైన్లు ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

పార్వతీపురం టౌన్: సంక్రాంతి పండుగను పురష్కరించుకుని లక్షలాది మంది ప్రజలు తమ స్వగ్రామాలకు చేరుకుని సందడి చేసిన సంగతి తెలిసిందే. పండగ ముగియడంతో వారంతా తాము పనులు చేసు కుంటున్న పట్టణాలకు బుధవారం బయలుదేరారు. దూర ప్రాంతాలకు వెళ్ళవలసిన వాళ్ళు బరువైన గుండెలతో కన్న వాళ్ళకు వీడ్కోలు పలుకుతూ ప్రయాణం చేసేందుకు అధిక సంఖ్యలో పార్వతీపురంటౌన్, బెలగాం రైల్వే స్టేషన్‌లకు చేరుకోవడంతో రైల్వే స్టేషన్‌లు కిక్కిరిసిపోయాయి.

మద్యం మత్తులో యువకుడు మృతి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం పంచాయతీ పరిధిలోని కారాడవలస గ్రామానికి చెందిన పిచ్చిక చంద్రశేఖర్ అధికంగా మద్యం సేవించి గ్రామ పొలిమేరలలో బుధవారం అపస్మారక స్థితిలోకి చేరుకుని పడిపోయాడు. స్పందించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలియజేశారు. రూరల్ పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.


రోడ్డుపై మృతి చెందిన చంద్రశేఖర్

మద్యానికి బానిసై ఆత్మహత్య

సాలూరు: పట్టణంలోని మహంతి వీధిలో బుధవారం మద్యానికి బానిసైన వాడపల్లి సురేష్ (46) తన ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఉమామహేశ్వరి, తన ఇద్దరు పిల్లలు ఇంట్లో లేని సమయంలో ఒంటరిగా ఉన్న సురేష్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. గత కొంతకాలంగా మద్యం మానేయాలని భార్య, పిల్లలు వారిస్తున్నా వినకపోవడంతో వారు ఇంటిని వదిలి వెళ్ళిపోయారు. ఈ సంఘటనపై సిఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశిల గ్రామానికి చెందిన ఆర్. పోలీసు అనే యువకుడు మద్యానికి బానిసై గత మూడు రోజులు నుంచి విపరీతంగా తాగుతున్నాడు. ఇదేం పని అని కుటుంబ సభ్యులు నిలదీయడంతో మనస్థాపం చెంది బుధవారం మధ్యాహ్నం ఇంటిలో ఉన్న చీమల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబీకులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసి కేసు నమోదు చేశారు.

సారాయి ధ్వంసం

పార్వతీపురం రూరల్ : అక్రమ సారాయి రవాణా చేస్తున్న వారి నుండి కేసులు నమోదు చేసి స్వాధీన పరుచుకున్న 2,500 లీటర్ల సారా ప్యాకెట్లు, క్యాన్లను బుధవారం రూరల్ పోలీసులు ఎస్‌బి సూపరింటెండెంట్ ఆర్ సుధాకర్ ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణ శివారులోని నవిరి కాలనీ దాటిన తర్వాత ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడువు తీరిపోయిన మద్యాన్ని అధికారుల ఆదేశాల మేరకు ధ్వంసం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సింహాచలం, ఎస్ఈబి సిబ్బంది పాల్గొన్నారు.


నాటుసారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

600 సారా ప్యాకెట్లు స్వాధీనం

పాచిపెంట: మండలం గోగాడవలస గ్రామం వద్ద 600 సారా ప్యాకెట్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ ముసలయ్య తెలిపారు. పాచిపెంట గ్రామానికి చెందిన ఆర్. అచ్చితు, పద్మాపురం గ్రామానికి చెందిన కె.రాము ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అక్రముగా 600 సారా ప్యాకెట్లను తరలిస్తుండగా గోగాడవలస గ్రామం వద్ద వారిని పట్టుకుని సారా ప్యాకెట్లు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మహారాజశ్రీ విజయనగరం మోటారు యాక్సిడెంట్ క్లెయిమ్ ట్రిబ్యునల్ మరియు 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు-విజయనగరం

ఐ.ఎ. 194/2021 : ఐ.ఎ. 195/2021
ఇన్
ఎం.వి.ఓ.పి.నెం. 516/2015

బిట్వీన్ :
పట్టా జ్యోతి మరియు వగైరా..........................పిటిషనర్లు
మరియు
కంది గోవింద మరియు వగైరాలు................రెస్పాండెంట్లు

3వ రెస్పాండెంటు వివరం:
పి. నారాయణరావు, తండ్రి సత్యం, స్కూటర్ యజమాని, స్కూటర్ నెం. ఏపి 35సి 9311, నివాసం చోలపాదం, కొమరాడ, విజయనగరం జిల్లా.

4వ రెస్పాండెంట్ వివరం :
పి. నారాయణరావు, తండ్రి సత్యం, స్కూటర్ యజమాని, స్కూటర్ నెం. ఏపి 35సి 9311, నివాసం చోలపాదం, కొమరాడ, విజయనగరం జిల్లా.

నోటీసు

పై నెంబరు కేసులో పిటిషనర్లు, రెస్పాండెంట్లపై ఇన్సూరెన్స్ నష్టపరిహారం ఇప్పించవలసినదిగా కోర్టులో పెట్టిన కేసులో 3వ మరియు 4వ రెస్పాండెంట్లకు నోటీసు అమలు జరగనందున ఈ పత్రికా ప్రకటన ద్వారా 3వ మరియు 4వ రెస్పాండెంట్లు కేసు వాయిదా నిమిత్తము కోర్టువారి ఆదేశాలు మేరకు ఈ ప్రకటన వేయబడినది. సదరు కేసు తేది 31-01-2023 వాయిదా అయి ఉన్నది. కావున 3వ మరియు 4వ రెస్పాండెంట్లు స్వయంగా గాని, వారి తరపున న్యాయవాది ద్వారా గాని పై తేదీన ఉదయం 10.30 ని॥లకు పైన పేర్కొనబడిన కోర్టులో హాజరు కావలసియున్నది. లేని యెడల కోర్టువారు పై రెస్పాండెంట్లుపై పరోక్షముగా నిర్ణయం తీసుకొనబడును.

విజయనగరం.
తేది.18.01.2023

కరణం సూర్యతేజ్
పిటిషనర్లు తరుపు న్యాయవాది
విజయనగరం. 9440108023

మహారాజశ్రీ పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి - కం - స్పెషల్ ఆఫీసరు వారి కోర్టులో

E.P. 6/2020 in A.T.C. 3/2008

Between:-
శిల్లా రమణయ్య (died) వ॥...D.Hr- పిటీషనర్లు
And:-
శీమల సూర్యనారాయణ (died) వ॥...JDr- రెస్పాండెంట్లు

నోటీసు

To
శీమల శ్రీనివాసరావు (4వ J.Dr- రెస్పాండెంటు) S/o లేటు సూర్యనారాయణ, వ్యవసాయం, R/o వెలగవాడ గ్రామం, పాలకొండ మండలం, Erstwhile శ్రీకాకుళం జిల్లా, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా.

యిందలి D.Hr- పిటీషనర్లు, రెస్పాండెంటు - J.Drs పైన మ॥ పాలకొండ స్పెషల్ ఆఫీసరు వారి కోర్టులో EP 6/2020 in A.T.C 3/2008 నెంబరు గల పిటీషను దాఖలు చేసియున్నారు. యిందు విషయమై 4వ J.Dr - రెస్పాండెంటు అయిన మీకు ఎట్టి ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టులో స్వయముగా గాని లేదా ప్లీడరుగారు ద్వారా గాని **తే 25-1-2023దీని పగలు 10-30 గంటలు**కి పై కోర్టుకి హాజరై మీ ఆక్షేపణలను తెలియచేసు కోవలెను. లేని ఎడల 4వ రెస్పాండెంటుకి - J.Drకి ఎట్టి ఆక్షేపణ లేదని 4వ J.Dr - రెస్పాండెంటు పరోక్షమందు తీర్మానింపబడునని యిందు మూలముగా ప్రకటించడమైనది.

కె.ఆనందుకుమార్
పిటిషనరు- D.Hr తరుపు న్యాయవాది
పాలకొండ, పార్వతీపురం మన్యం జిల్లా.